సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 21 । డిసెంబర్ । 2024



చీనీ టన్ను రూ.21 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.21,000 పలికాయి. మార్కెట్టుకు 20 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.14

అనంతపురం కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.14 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
31.9°/18.3°

జిల్లాలో చలి కాస్త తగ్గింది. అక్కడక్కడ తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్, చిత్రంలో జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: సీఎం కార్యాలయం నుంచి వచ్చే ప్రతి అర్జీనీ క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ చేతన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్‌ఓ విజయసారథి, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టి వాటికి రికార్డులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి సమావేశాల్లో ఆర్డీఓలు పాల్గొంటారని, డివిజన్‌కు సంబంధించిన ప్రతి అంశంపైనా అవగాహన ఉండాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ అయితే అందుకు తగిన కారణాలు వివరించాలన్నారు. రెవెన్యూ అంశాలకు సంబంధించి కంటెంట్ కేసులు జిల్లాలో 32 ఉన్నాయని, వాటిని హైకోర్టులో కౌంటర్ ఫైల్ చేశారా లేదా అని ఆర్డీఓలు చూసుకోవాలన్నారు. ఫ్రీహోల్డ్ వెరిఫికేషన్ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణపై 4,633 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 3,904 పరిష్కరించామని తెలిపారు. ఫారం 6, 7, 8ను సంబంధిత బీఎల్‌ఓలు సమగ్ర విచారణ జరిపి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు, తహసీల్దార్లు, కలెక్టరేట్ లోని అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

టిప్పర్ల సీజ్‌తో ముదిరిన రాజకీయ వివాదం

పెనుకొండ: మంత్రి సవిత – ఎంపీ బీకే పార్థసారథి మధ్య రాజకీయ వివాదం ముదిరింది. టిప్పర్ల సీజ్ వ్యవహారంతో ఇది మరోసారి బయటపడింది. వివరాల్లోకెళితే.. పుట్టపర్తి మండలం గంట్ల మారెమ్మ గుడి వద్దనున్న కంకర మిషన్ నుంచి కియా పరిశ్రమ సమీపంలోని గ్రీన్‌టెక్ మిక్సింగ్ ప్లాంట్ వద్దకు టిప్పర్ల ద్వారా కంకర తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి అధిక లోడ్‌తో వెళ్తున్న టిప్పర్లను కియా పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ రాజేష్, సిబ్బంది సీజ్ చేసి.. ఆర్టీఏ అధికారులకు స్వాధీనం చేశారు. అయితే గ్రీన్‌టెక్ నిర్వాహకులు హిందూపురం ఎంపీ బీకే పార్థసారథిని ఆశ్రయించారు. దీంతో ఎంపీ రంగంలోకి దిగారు. ఇదంతా మంత్రి సవిత అనుచరులు కొందరు చేయిస్తున్నారని, తొందరపడి చర్యలు తీసుకోవద్దని పోలీసులపై ఒత్తిడి తీసుకొచ్చారు. సమస్య ఎటు దారి తీస్తుందోనని పోలీసులు కేసు నమోదు చేయడంపై ఆగ్రహంతో ఉన్న ఎంపీ, ఆయన అనుచరులు కియా పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చి ఆందోళన చేసే అవకాశం ఉందన్న ప్రచారం జరిగింది. దీంతో మీడియా సైతం స్టేషన్ వద్దకు చేరుకుంది. అయితే విజయవాడ నుంచి బెంగళూరుకు విమానంలో వచ్చిన ఎంపీ నేరుగా పెనుకొండలోని స్వగృహానికి చేరుకున్నారు. స్టేషన్‌కు రాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆర్టీఏ అధికారులు ఫైన్ వేసి రాత్రి 7.30 గంటల సమయంలో టిప్పర్లను విడిచిపెట్టినట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

విద్యుత్ ప్రమాద మృతి కేసులో రెండేళ్ల జైలు

మడకశిర: విద్యుత్ ప్రమాద మృతి కేసులో హనుమంతరాయప్ప అనే ముద్దాయికి రెండేళ్ల జైలు శిక్ష పడింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుడ్డయ్యపాళ్యం గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప నాలుగేళ్ల క్రితం తన దానిమ్మతోటకు రక్షణగా ముందు జాగ్రత్తలేవీ తీసుకోకుండా విద్యుత్ తీగలు అమర్చాడు. తోటలోకి వెళ్లిన ప్రసాద్ అనే వ్యక్తి విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటి ఏఎస్‌ఐ కృష్ణారెడ్డి కేసు నమోదు చేశారు. ప్రసాద్ మృతికి ముద్దాయి హనుమంతరాయప్పను కారకుడిగా భావించి రెండేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి అశోక్‌కుమార్ శుక్రవారం తీర్పు చెప్పారు. ఈ కేసును ఏపీపీ విఠల్‌రావు వాదించారు.

23న జాబ్ మేళా

మడకశిర: పట్టణంలోని ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 23న ఉదయం 9 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, పీజీ చేసిన యువతీ యువకులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చన్నారు. 8 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలకు ఎంపిక చేస్తారన్నారు.

దార్శనిక నేత.. విద్యా ప్రదాత



- జగన్ హయాంలో ప్రభుత్వ పాఠశాలలకు పునరుజ్జీవం
- పేదింటి పిల్లల ఉన్నత చదువులకు పూర్తిస్థాయి భరోసా
- కార్పొరేట్‌కు దీటుగా బోధన.. పోటీ తట్టుకునేలా తర్ఫీదు
- నేడు విద్యారంగంపై కూటమి సర్కారు నిర్లక్ష్యం
- పథకాల అమలుకు పడని అడుగులు

వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో విద్యా రంగం కొత్త పుంతలు తొక్కింది. అమ్మఒడి, ఫీజురీయింబర్స్‌మెంట్, నాడు–నేడు, డిజిటల్, ఆంగ్ల బోధన, విదేశీ విద్య ఇలా ఎన్నో కార్యక్రమాలతో నవశకానికి నాంది పలికారు. చదువుతోనే సమాజ మార్పు సాధ్యమని బలంగా నమ్మిన నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ దిశగానే ప్రతి అడుగు వేశారు. ఏటా తన పుట్టిన రోజు సందర్భంగా 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్ ఉన్న ట్యాబ్‌లను పంపిణీ చేసి చదువులకు బాసటగా నిలిచారు. నేడు జగన్ జన్మదినం సందర్భంగా నాడు లబ్ధిపొందిన కుటుంబాలన్నీ మరోసారి ఆయన్ను గుర్తు చేసుకుంటున్నాయి.

పుట్టపర్తి/ సాక్షి, పుట్టపర్తి: వైఎస్ జగన్ పాలనలో ప్రభుత్వ పాఠశాలలు కొత్తరూపు సంతరించుకున్నాయి. నాడు–నేడు కార్యక్రమం కింద 1677 పాఠశాలల్లో రూ.487 కోట్లు వెచ్చించి భవనాలు, తరగతి గదులు ఆధునీకరించారు. తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించారు. విద్యా ప్రమాణాలు కూడా మెరుగుపడ్డాయి. జగనన్న గోరుముద్ద పథకం కింద మెనూలో మార్పులు తీసుకొచ్చి బలవర్ధకమైన పౌష్టికాహారం అందించారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలు ఆధునికతను సంతరించుకున్నాయి. ఆంగ్ల మాధ్యమం సైతం ప్రవేశపెట్టడం, డిజిటల్ బోధనలో భాగంగా ట్యాబ్‌లు, స్మార్ట్‌టీవీలు, ఐఎఫ్‌పీలు అందుబాటులోకి తేవడంతో ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు క్యూ కట్టారు. జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 2,100 ఉన్నాయి. ఇందులో గత విద్యా సంవత్సరం (2023–24)లో 1.65 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసించారు.

కూటమి సర్కారు చిన్నచూపు

కూటమి సర్కారు వచ్చాక ప్రభుత్వ పాఠశాలలపై చిన్నచూపు చూస్తోంది. మౌలిక సదుపాయాల కల్పనపైనా దృష్టి సారించలేదు. దీంతో ఈ విద్యాసంవత్సరం విద్యార్థుల సంఖ్య 1.25 లక్షలకు పడిపోయింది. ఇప్పటి వరకు 'తల్లికి వందనం' తదితర విద్యా పథకాల అమలులో ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కూటమి సర్కారు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని ఒత్తిడి తెస్తుండడంతో పలువురు మధ్యలోనే చదువులు ఆపేయాల్సిన పరిస్థితి నెలకొంది.



జగన్ హయాంలో ట్యాబ్‌ల పంపిణీ ఇలా..

సంవత్సరం	విద్యార్థుల సంఖ్య
2022-23	17,523
2023-24	16,167

జిల్లాలో జగన్ హయాంలో అమ్మ ఒడి లబ్ధి

విద్యా సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	వెచ్చించిన మొత్తం (రూ.కోట్లలో)
2019-20	162574	243.86
2020-21	161554	242.33
2021-22	166339	249.60
2022-23	162080	210.70
జగనన్న విద్యా కానుక		
2022-23	1,62,699	27.14.
2023-24	1,44,979	35.07.
జగనన్న వసతి దీవెన లబ్ధి వివరాలు		
2019-20	39,119	41.14
2020-21	43,301	43.57
2021-22	43,016	43.16
2022-23	36,312	34.51
జగనన్న విద్యా దీవెన వివరాలు		
2019-20	40,136	90.27.
2020-21	44,082	73.54.
2021-22	43,872	86.44.
2022-23	37,193	64.66

నాడు-నేడు కింద అభివృద్ధి ఇలా..

విడత	పాఠశాలలు	నిధులు (రూ.కోట్లలో)
మొదటి	596	171
రెండవ	1,081	316

ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి



దేశంలో ఎక్కడా లేని విధంగా గడిచిన ఐదేళ్లలో పేద విద్యార్థులకు అనేక పథకాలు అమలు చేసి.. వారి చదువులను ప్రోత్సహించిన ఘనత వైఎస్ జగన్ సర్కార్‌కే దక్కింది. కూటమి ప్రభుత్వం కూడా పేదల చదువులను ప్రోత్సహించి.. ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి. విద్యార్థుల ప్రవేశాలు పెరిగేందుకు చర్యలు చేపట్టాలి. – పీవీ రమణారెడ్డి, వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు

ఆంగ్ల మాధ్యమం అద్భుతం



జగన్ ప్రభుత్వంలో పేద విద్యార్థులకు ఎంతో మేలు జరిగింది. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే మేము మా పిల్లలను ప్రభుత పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంలో ఉచితంగా చదివించాం. మాలాంటి వాళ్లకు సర్కారు బడిలోనే కాన్వెంట్ చదువులు దొరకడం అదృష్టంగా భావిస్తున్నాం. – శిల్ప, వెలిచలమల, ఎన్‌పీ కుంట మండలం.

'అమ్మ ఒడి'ని మరువలేం



జగన్ సర్కార్‌లో మాలాంటి పేదల పిల్లల చదువులను ప్రోత్సహించేందుకు అమ్మ ఒడి పథకం కింద ప్రతి ఏటా క్రమం తప్పకుండా రూ.15 వేలు అందించారు. నా కుమార్తె హర్షిణి 8వ తరగతి చదువుతోంది. పిల్లల చదువులకు ఎంతగానో ఉపయోగపడే ఈ పథకాన్ని ఎన్నటికీ మరువలేం. – అరుణ, మరువకొత్తపల్లి, చిలమత్తూరు మండలం

చదువులకు భరోసా కల్పించాలి



నా కుమార్తె దీపిక ఐదో తరగతి చదువుతోంది. జగన్ ప్రభుత్వంలో వరుసగా నాలుగుసార్లు 'అమ్మ ఒడి' పథకం అందింది. ఈ సహాయం మరువలేనిది. కూటమి ప్రభుత్వం ఎన్నికలకుముందు చెప్పిన విధంగా 'తల్లికి వందనం' పథకం కింద రూ.15 వేలు అందించి చదువులకు భరోసా కల్పించాలి. – రాజేశ్వరి ధూపంపల్లి, బుక్కపట్నం మండలం

నాడు స్వర్ణయుగం



వైఎస్ జగన్ పాలనలో విద్యా రంగానికి స్వర్ణ యుగంగా చెప్పుకోవచ్చు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశారు. ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పెట్టి పేద విద్యార్థులకూ కాన్వెంట్ చదువులు తీసుకొచ్చారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం తద్భిన్నంగా వ్యవహరిస్తోంది. – కదిరీష్ వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు

పేదల పెన్నిధి వైఎస్ జగన్



సోమందేపల్లిలో కేక్ కట్ చేస్తున్న ఉషశ్రీచరణ్

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



తరలి వచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సోమందేపల్లి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పాలిట పెన్నిధి అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. శుక్రవారం సోమందేపల్లిలో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను ముందస్తుగా నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమక్షంలో ఆమె భారీ కేక్ కట్ చేశారు. అనంతరం వైఎస్సార్ విగ్రహంతో పాటు వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వైఎస్సార్ సర్కిల్ నుంచి సాయిబాబా ఆలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల సంక్షేమానికీ జగన్ పెద్దపీట వేశారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అధికార పార్టీ నేతలు ఇసుక, మద్యం వ్యాపారాల్లో మునిగి తేలుతున్నారన్నారు. ఆరు నెలల్లోనే ప్రజా వ్యతిరేకతను కూటమి సర్కారు మూట గట్టుకుందన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్న కూటమిని రాబోవు ఎన్నికల్లో సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పొగాకు రామచంద్ర, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు గజేంద్ర, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, నరసింహ, తిమ్మయ్య, నరసింహమూర్తి, వీరనారాయణరెడ్డి, మేదర శంకర, జెడ్పీటీసీ అశోక్, ముఖ్యనాయకులు చరణ్‌రెడ్డి, ఫక్రుద్దీన్, రమాకాంత్‌రెడ్డి, కంబాలప్ప, శివారెడ్డి, సర్పంచ్‌లు అంజినాయక్, జీలాన్, కిష్టప్ప, సింగిల్‌విండో చైర్మన్లు ఆదినారాయణరెడ్డి, సూర్య ప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ ఏఆర్ జట్టు



ఓవరాల్ చాంపియన్ జట్టుకు షీల్డ్ అందజేస్తున్న ఎస్పీ రత్న



సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షిస్తున్న అదనపు జిల్లా జడ్జి శైలజ, ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ చాంపియన్ విజేతగా ఏఆర్ (ఆర్మ్‌డ్ రిజర్వ్) జట్టు నిలిచింది. స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో మూడు రోజులుగా సాగుతున్న పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీలు శుక్రవారం ముగిశాయి. క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, షటిల్, మ్యూజికల్ చైర్స్, 100 మీటర్ల పరుగు, హైజంప్, లాంగ్ జంప్, లిఫ్టింగ్ సహా 20 క్రీడల్లో ఫైనల్ పోటీలు నిర్వహించారు. ఇందులో ఓవరాల్ చాంపియన్‌గా ఆర్మ్‌డ్ రిజర్వ్ జట్టు నిలవగా.. రెండో స్థానంలో ఆల్ వింగ్స్ జట్టు నిలిచింది. చివరగా ఎస్పీ, ఏఎస్పీ జట్లు టగ్ ఆఫ్ వార్ ఆడారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో ఎస్పీ రత్న జట్టు గెలుపొందింది. అనంతరం ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. ముగింపు కార్యక్రమంలో ఎస్పీ రత్న మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన స్ఫూర్తితోనే విధుల్లో కూడా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఏఓ సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, డీఎస్పీలు విజయకుమార్, వెంకటేశ్వర్లు, కేవీ మహేష్, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్, ఆర్‌ఐలు వలి, రవికుమార్, మహేష్, ఆర్ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, ప్రదీప్‌సింగ్, వీరన్న, పీఈటీలు వెంకటేష్, రామకృష్ణ, సూర్యనారాయణ, సుధాకర్, నాగరాజు, స్వర్ణ, ఉషారాణి, సుహాసిని పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ముగింపు సందర్భంగా శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకొన్నాయి. అదనపు జిల్లా జడ్జి శైలజ, ఎస్పీ రత్న, పోలీస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని చూపుతున్న అధికారులు

బత్తలపల్లి: కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న 62 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందిన పక్కా సమాచారం మేరకు అప్రమత్తమైన విజిలెన్స్ సీఐ కె.శ్రీనివాసులు... డీసీటీఓ సురేష్‌కుమార్, బత్తలపల్లి సీఎస్‌డీటీ రామకృష్ణను కలుపుకుని శుక్రవారం బత్తలపల్లి మండలం లింగారెడ్డిపల్లి సమీపంలోని ప్రైవేట్ పాల డెయిరీ ఎదుట వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన టాటా 407 (ఏపీ21టీజెడ్2205) వాహనాన్ని అడ్డుకుని పరిశీలించడంతో 124 బస్తాల్లోని 62 క్వింటాళ్ల రేషన్ బియ్యం బయటపడింది. కర్ణాటకలోని బంగారుపేటకు బియ్యాన్ని తరలిస్తున్నట్లుగా డ్రైవర్ అంగీకరించాడు. వాహనాన్ని సీజ్ చేసి, బియ్యాన్ని సీఎస్‌డీటీ రామకృష్ణకు అప్పగించారు. బియ్యం తరలిస్తున్న ఎరికల మహేష్ (నార్పల), సోమందేపల్లికి చెందిన నరేష్ (బయ్యర్), డ్రైవర్ బోయ సతీష్ (స్నేహలత కాలనీ, సోమందేపల్లి), సహాయకుడు అశ్వత్థనారాయణ (సోమందేపల్లి)ను అదుపులోకి తీసుకుని బత్తలపల్లి పోలీసులకు అప్పగించారు. నిందితులపై క్రిమినల్ కేసు నమోదుకు సిఫారసు చేశారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఐఓ



వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ నాగేంద్ర నాయక్

లేపాక్షి: స్థానిక పీహెచ్‌సీని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ నాగేంద్రనాయక్ శుక్రవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేసారు. ల్యాబ్, ఫార్మసీ, లేబర్‌వార్డులను పరిశీలించారు. అందుతున్న వైద్య సేవలపై రోగులతో ఆరా తీశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట స్థానిక వైద్యాధికారి డాక్టర్ వెంకటచిరంజీవి, ఎంపీహెచ్‌ఈఓ సుబ్రహ్మణ్యం, సీహెచ్‌ఓ, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఒకే ఒక క్షణం..

ఒకే ఒక క్షణం. కలో.. నిజమో.. నిర్ధారించుకునే లోపు హాహాకారాలు మిన్నంటాయి. డివైడర్‌ను బొలెరో ఢీకొనడంతో కన్నుమూసి తెరిచేలోపు ఆ ప్రాంతం మొత్తం భయానక వాతావరణం నెలకొంది. తుమ్మ మొద్దుల మధ్య నలిగిన కూలీలు... నెత్తురోడుతున్న శరీరాలు... సహాయక చర్యల్లో నిమగ్నమైన స్థానికుల కేకలతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది.



సంఘటనాస్థలంలో నెలకొన్న భయానక దృశ్యం



పరిస్థితి విషమంగా ఉన్న ముత్యాలప్ప

డివైడర్‌ను ఢీ కొన్న బొలెరో

- ఆరుగురికి తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం

బత్తలపల్లి: అనంతపురం – చెన్నై మార్గంలోని జాతీయ రహదారిపై బత్తలపల్లి మండలం రామాపురం కూడలిలో శుక్రవారం ఉదయం ఓ బొలెరో వాహనం ప్రమాదానికి గురైంది. వేగంగా వెళుతున్న వాహనం టైరు పేలడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఘటనలో ఆరుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా మారింది.

వివరాలు ఇలా...

బత్తలపల్లి మండలం ఓబుళాపురం గ్రామానికి చెందిన కదిరిప్ప, ధర్మవరం పట్టణ నివాసి గంగప్ప, ఇదే మండలం నాగలూరుకు చెందిన ముత్యాలప్ప, రంగా, హరి దినసరి కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. వీరిలో రంగా బొలెరో వాహన డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అందరూ కలసి శుక్రవారం ఉదయం ధర్మవరం పట్టణానికి చెందిన చితంబరం అనే వ్యక్తి ముదిగుబ్బలో కొనుగోలు చేసిన తుమ్మ మొద్దులను ధర్మవరానికి తరలించేందుకు కూలి పనికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బొలెరో వాహనంలో లోడ్ చేసిన మొద్దులపై కూలీలు కూర్చొని ప్రయాణిస్తున్నారు. బత్తలపల్లి మండలం రామాపురం కూడలికి చేరుకోగానే రోడ్డు రాపిడి కారణంగా వేడెక్కిన టైర్ ఒక్కసారిగా పేలింది. దీంతో వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న జాతీయ రహదారి డివైడర్‌ను ఢీకొనడంతో మొద్దులన్నీ రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. వాటిపై కూర్చొన్న కూలీలు మొద్దుల కింద పడి రక్తగాయాల పాలయ్యారు. దినసరి కూలీలతో పాటు చితంబరం కూడా గాయపడ్డాడు. ఆ సమయంలో అక్కడ భయానక వాతావరణం నెలకొంది. స్థానికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి వైద్యులు రెఫర్ చేశారు. వీరిలో ముత్యాలప్ప పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



డివైడర్‌ను ఢీకొన్న బొలెరో వాహనం

యువకుడి హత్య



గిత్తరాజు (ఫైల్)

కుందుర్పి: మండలంలోని వడ్డెపాళ్యం గ్రామానికి చెందిన గిత్తరాజు (28) హత్యకు గురయ్యాడు. జిల్లా సరిహద్దున కర్ణాటక పరిధిలోని శీగలపల్లి క్రాస్ వద్ద గురువారం రాత్రి ఆయనను దుండగులు హతమార్చారు. కాగా, కుందుర్పి మండలం మలయనూరు గ్రామానికి చెందిన ఓ యువతితో గిత్తరాజు వివాహేతర సంబంధం నెరపేవాడు. ఈ క్రమంలో యువతి తరఫు కుటుంబసభ్యులు ఎంత నచ్చచెప్పినా వినకపోవడంతో వారే పథకం ప్రకారం గిత్తరాజును హతమార్చినట్లుగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై కర్ణాటకలోని పరుశురాంపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా పరుశురాంపురంలో ఒకరిని, మలయనూరులో ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. కాగా, హతుడు గిత్తరాజుకు భార్య ఈశ్వరమ్మ, ఆరు నెలల వయసున్న చిన్నారి ఉన్నారు.

ఆస్పత్రి ఆవరణలో వృద్ధుడి మృతి



మృతుడు జోగన్న

అమరాపురం: మండలంలోని నగోనపల్లి గ్రామానికి చెందిన జోగన్న (60) మడకశిర ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఉన్న ఆంజనేయ స్వామి కట్ట వద్ద మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... కోర్టు కేసు నిమిత్తం మడకశిరకు వెళ్లి వస్తానని శుక్రవారం ఉదయం భార్య గౌరమ్మకు తెలిపి జోగన్న బయలుదేరారు. కోర్టు వద్ద అడ్వకేట్‌తో మాట్లాడిన అనంతరం అస్వస్థతకు గురి కావడంతో అక్కడే ఉన్న ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. అనంతరం ఆస్పత్రి ఆవరణలోని ఆంజనేయస్వామి కట్ట వద టవాల్ పరుచుకుని నిద్రించాడు. ఈ క్రమంలో అక్కడి సిబ్బంది లేపడానికి ప్రయత్నించినా ఆయనలో చలనం లేకపోవడంతో సమాచారం అందుకున్న వైద్యులు అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై మడకశిర పోలీసులు విచారణ చేపట్టారు.

ప్రేమికుల ఆత్మహత్య





మృతులు గోవిందరెడ్డి జ్యోతి

పావగడ: జీవితంపై విరక్తితో ప్రేమికులు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం జిల్లా కుందుర్పి మండలం వెంకటమ్మనపల్లికి చెందిన గోవిందరెడ్డి, లక్ష్మీదేవి (బధిరురాలు) బతుకు తెరువు కోసం వచ్చి కొన్నేళ్లుగా బెంగళూరులోనే స్థిరపడ్డారు. ఈ క్రమంలో అక్కడ పరిచయమైన జ్యోతి(30)తో గోవిందరెడ్డి (35) వివాహేతర సంబంధం కొనసాగిస్తూ వచ్చాడు. గురువారం పావగడకు వచ్చిన వారు రాత్రి స్థానిక ఓ హోటల్‌లో బస చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు చెళ్లకెరె క్రాస్ వద్దకు చేరుకుని బయలు ప్రదేశంలో మద్యంలో విషపూరిత ద్రావకం కలుపుకుని తాగారు. అటుగా వెళ్లిన వారు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పావగడ పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. జ్యోతి మరణించినట్లు నిర్ధారించుకున్నారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న గోవిందరెడ్డిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఉదయం 11 గంటలకు గోవిందరెడ్డి మృతి చెందాడు. సమాచారం అందుకున్న మృతురాలు జ్యోతి తల్లిదండ్రులు బెంగళూరు నుంచి పావగడ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ సురేష్ తెలిపారు. కాగా, ప్రేమికుల ఆత్మహత్యకు స్పష్టమైన కారణాలు తెలియాల్సి ఉంది.

‘యువగళం’ హామీలు అమలు చేయాలి

- ఏఐఎస్ఎఫ్ నాయకుల డిమాండ్

పుట్టపర్తి టౌన్: యువగళం పాదయాత్రలో నారా లోకేష్ విద్యార్థులకు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శేషం మహేంద్ర, కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. డిమాండ్ సాధనలో భాగంగా శుక్రవారం పుట్టపర్తిలోని గణేషకూడలిలో ధర్నా చేపట్టి, మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు బకాయి పడిన ఫీజు రీయంబర్స్‌మెంట్ రూ.2,100 కోట్లు, వసతి దీవెన నిధులు రూ.1,480 కోట్లను తక్షణమే విడుదల చేయాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు పేరుకుపోవడంతో కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఆయా కళాశాలల యాజమాన్యాలు మొండికేస్తున్నాయని మండిపడ్డారు. జీఓ నంబర్ 77ను రద్దు చేయడంతో పాటు పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తామంటూ నాడు ప్రతిపక్షంలో ఉంటూ చేపట్టిన యువగళం పాదయాత్రలో నారా లోకేష్ స్పష్టమైన హామీనిచ్చారని గుర్తు చేశారు. నేడు అధికారం చేపట్టి 8 నెలలు కావస్తున్నా నేటికీ ఈ హామీల అమలుపై నిర్లక్ష్యం కనబరుస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో కూటమి పెద్దలు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చాలని, లేకపోతే ప్రజలను చైతన్యవంతులను చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్‌రెడ్డి, నరసింహమూర్తి, సాయిగౌతమ్, రవి, చరణ్, గోపి, విశ్వనాథ్, అనిల్, శ్యామ్‌సుందర్, అశోక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

వ్యక్తి దుర్మరణం

గోరంట్ల: ద్విచక్ర వాహనం బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. మృతుడిని గోరంట్ల మండలం కాటేపల్లికి చెందిన వడ్డె హరి (35)గా గుర్తించారు. హిందూపురంలో నివాసముంటున్న ఆయన స్వగ్రామంలో ఉన్న తల్లిని చూసేందుకు ద్విచక్ర వాహనంపై శుక్రవారం వచ్చాడు. తల్లిని పలకరించిన అనంతరం రాత్రి తిరుగు ప్రయాణమైన ఆయన పాలసముద్రం వద్దకు చేరుకోగానే నియంత్రణ కోల్పోవడంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై గోరంట్ల పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కానిస్టేబుల్ అనుచిత ప్రవర్తన

గుత్తి: రైలు ప్రయాణికురాలిపై ఓ కానిస్టేబుల్ అనుచితంగా ప్రవర్తించాడు. వివరాలు... విజయవాడ దుర్గమ్మ ఉత్సవాలకు సంబంధించి బందోబస్తు నిర్వహణకు జిల్లాకు చెందిన పలువురు కానిస్టేబుళ్లు గురువారం రాత్రి ధర్మవరం నుంచి మచిలీపట్నం వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు(17216)లో బయలుదేరారు. రిజర్వేషన్ కోచ్‌లో ప్రయాణిస్తున్న వీరిలో గుత్తి పీఎస్‌కు చెందిన ఓ కానిస్టేబుల్ అదే కోచ్‌లో ప్రయాణిస్తున్న యువతి పట్ల అనుచితంగా ప్రవరిస్తూ తన కోరిక తీర్చాలని బెదిరింపులకు దిగాడు. విషయాన్ని గమనించిన తోటి ప్రయాణికులు వెంటనే ఆగ్రహం వ్యక్తం చేస్తూ దేహశుద్ధి చేయడానికి సిద్ధం కావడంతో టాయిలెట్‌లోకి దూరి తలుపు వేసుకున్నాడు. అప్పటికే ఆగ్రహంతో ఊగిపోతున్న ప్రయాణికులు టాయిలెట్ తలుపు బద్దలు కొట్టేందుకు సిద్ధమయ్యారు. అదే సమయంలో అక్కడున్న వయో వృద్ధులు కల్పించుకుని వారించడంతో ప్రయాణికులు శాంతించారు. కాగా పరువు పోతుందని భావించిన బాధితురాలు... కానిస్టేబుల్ దుశ్చర్యపై ఫిర్యాదు చేసేందుకు వెనుకంజ వేసినట్లు తెలిసింది.

పాత పద్ధతుల్లోనే వైద్య సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న దామోదరరావు

- ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు

పుట్టపర్తి టౌన్: ఏపీఎస్ ఆర్టీసీ కార్మికులకు పాత పద్ధతుల్లోనే వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. పుట్టపర్తిలోని అబ్దుల్ కలాం షాదీ మహల్‌లో ఈయూ జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి అధ్యతన శుక్రవారం ఆ శాఖ జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. కార్యక్రమానికి ఆరు డిపోల నుంచి ఈయూ సభ్యులు పెద్దఎత్తున హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన దామోదరరావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ వైఖరితో ఆర్టీసీ ఉద్యోగులు అభద్రతా భావంతో విధులు నిర్వర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీలో 10వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.గత 12 సంవత్సరాలుగా కారుణ్య నియామకాల్లో తప్పా ఏ కేడర్‌లోనూ ఉద్యోగ నియామకాలు జరగలేదన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఈయూ స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఇర్షాద్, జోనల్ నాయకులు శేఖర్, అరుణమ్మ, నబీరసూల్, రీజనల్ అధ్యక్షుడు కేబీఎస్ రెడ్డి, కార్యదర్శి జీవైపీరావు, జిల్లా నాయకులు నారాయణస్వామి, ఆర్ఎస్ రెడ్డి, ప్రసాద్, రమణప్ప, శ్రీనివాసులు, విజయలక్ష్మి, సాదిక్, బాబు నరసింహులు, ఆరు డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.

హాకీ జట్ల ఎంపిక పోటీలు రేపు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఈ నెల 22న జిల్లా సబ్ జూనియర్, జూనియర్ బాలుర హాకీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ సూర్యప్రకాష్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపికైన సబ్ జూనియర్ క్రీడాకారులు జనవరి 17 నుంచి 20 వరకు మదనపల్లిలో జరిగే సబ్ జూనియర్ హాకీ పోటీల్లో పాల్గొంటారు. జూనియర్ హాకీ పోటీల తేదీ త్వరలో ప్రకటించనున్నారు. సబ్ జూనియర్ క్రీడాకారులు 01-01-2009 అనంతరం, జూనియర్ క్రీడాకారులు 01-01-2006 అనంతరం జన్మించి ఉండాలి. క్రీడాకారులు ఆధార్, బర్త్ సర్టిఫికెట్‌తో ఆదివారం ఉదయం 9 గంటలకు క్రీడా మైదానానికి చేరుకోవాలి.

మజ్దూర్ యూనియన్ డివిజన్ కార్యదర్శిగా విజయ్‌కుమార్

గుంతకల్లుటౌన్: దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్ నాలుగోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం సికింద్రాబాద్‌లో జోనల్ కార్యదర్శి సీహెచ్ శంకర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన యూనియన్ త్రైవార్షిక జనరల్ కౌన్సిల్ సమావేశంలో జోన్ పరిధిలోని వివిధ డివిజన్ల కమిటీలను ఎన్నుకున్నారు. ఇందులో గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్‌ను ఎన్నుకోన్నారు.

ఫోర్జరీ సంతకాలతో రేషన్ బియ్యం పక్కదారి!

- అక్రమాల్లో కీలకంగా వ్యవహరించిన కానిస్టేబుల్, వీఆర్వో

ఉరవకొండ: నియోజకవర్గంలో పెద్దఎత్తున పట్టుబడిన రేషన్ బియ్యం కేసులో అక్రమార్కులకు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది అండగా నిలిచారు. ఇందుకు గాను డీటీ, పోలీస్ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసి బియ్యాన్ని పక్కదారి పట్టించిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు...ఈ ఏడాది అక్టోబర్ 8న ఉరవకొండ శివారులోని రాములమ్మ ఆలయం వద్ద ఐచర్ వాహనం, ఆటోల్లో రేషన్ బియ్యాన్ని లోడ్ చేస్తున్నట్లుగా సమాచారం అందుకున్న అప్పటి సీఐ సురేష్‌బాబు, పోలీసులు అక్కడకు చేరుకుని వాహనాలను స్టేషన్‌కు తరలించారు. 140 బస్తాల్లో 68 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. అనంతరం పీఎస్‌లో అంతా తానై దుప్పటి పంచాయితీలకు తెరలేపే ఓ కానిస్టేబుల్ ఈ అంశంలో జోక్యం చేసుకుని అధికారులకు తెలియకుండా డిప్యూటీ తహసీల్దార్, అప్పటి సీఐ సంతకాన్ని ఫోర్జరీ చేసి 68 క్వింటాళ్ల బియ్యంలో కేవలం 30 క్వింటాళ్లను మాత్రమే స్వాధీనం చేసుకున్నట్లు రికార్డులు చూపించాడు. మిగిలిన 38 క్వింటాళ్ల బియ్యాన్ని పక్కదారి పట్టించాడు. ఈ వ్యవహారంలో ఓ వీఆర్వో ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఫోర్జరీ వ్యవహారం రెండు రోజుల క్రితం వెలుగుచూడడంతో రెవెన్యూ అధికారులు, పోలీసులు గుట్టు చప్పుడు కాకుండా విచారణ చేపట్టారు. దీనిపై తహసీల్దార్ మహబూబ్‌బాషాను వివరణ కోరగా ఫోర్జరీ సంతకాల అంశం వాస్తవమేనని నిర్ధారించారు.

చిరుత దాడి - దూడ మృతి

గుడిబండ: చిరుత దాడిలో ఓ దూడ మృతి చెందింది. గుడిబండ మండలం మద్దనకుంట గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు తిమ్మప్ప తన పశువులను, దూడలను వ్యవసాయ పొలంలో బోరు బావి వద్ద కట్టేసి ఉంచేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి పొలంలోకి ప్రవేశించిన చిరుత కట్టేసిన దూడను చంపి సగానికిపైగా అక్కడే తినేసింది. శుక్రవారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు దూడ కళేబరాన్ని చూసి సమాచారం ఇవ్వడంతో సర్పంచ్ జగదాంబ కృష్ణప్ప, స్థానికులు, అటవీశాఖ అధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించారు.

హంద్రీ–నీవా కాలువ వెడల్పు చేయాల్సిందే

- హెచ్ఎన్ఎస్ఎస్ ప్రయోజనాలకు సమాధి కడితే సహించం
- సీఎం చంద్రబాబు నిర్ణయంపై జలసాధన సమితి నాయకుల మండిపాటు
- కాలువ వెడల్పు చేయకనే లైనింగ్ పనులు చేపట్టే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

అనంతపురం సెంట్రల్: హంద్రీ–నీవా ప్రాజెక్టు ప్రయోజనాలకు సమాధి కట్టే కార్యక్రమానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని జల సాధన సమితి నాయకులు మండిపడ్డారు. హంద్రీ–నీవా కాలువ వెడల్పు చేయకుండానే లైనింగ్ పనులు చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం జీఓ జారీ చేయడాన్ని ఖండిస్తూ జలసాధన సమితి అధ్యక్షుడు రామ్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం హెచ్ఎన్ఎస్ఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, పలు రైతు సంఘాల నాయకులు, జలసాధన సమితి నాయకులు పాల్గొని మాట్లాడారు. హంద్రీ–నీవా కాలువ పనులు వెడల్పు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. 6.02 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ఈ ప్రాజెక్టు రూపకల్పన జరిగిందన్నారు. ఇది సాధ్యం కావాలంటే శ్రీశైలం సమీపంలోని మల్యాల నుంచి బెళుగుప్ప మండలం జీడిపల్లి వరకూ మొదటి దశ హంద్రీ–నీవా కాలవను 10వేల క్యూసెక్కులకు, జీడిపల్లి నుంచి దిగువకు 6 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండేలా కాలువ వెడల్పు చేయాల్సిన అవసరముందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం హంద్రీ–నీవాను 3,850 క్యూసెక్కుల నుంచి 6,300 క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యం ఉండేలా వెడల్పు చేసి లైనింగ్ పనులు చేపడుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇందుకు సంబంధించి 2021లో రూ.6,182 కోట్లతో పనులకు పరిపాలన అనుమతులు కూడా ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సీఎం చంద్రబాబు మాత్రం హంద్రీ–నీవా ప్రాజెక్టు లక్ష్యానికి తూట్లు పొడిచేలా 304, 305 జీఓలను జారీ చేసి కాలువ వెడల్పు పనులకు శాశ్వతంగా గండి కొట్టారని మండిపడ్డారు. వెంటనే ఈ జీఓలను రద్దు చేసి, హంద్రీ–నీవా కాలవను వెడల్పు చేయడంతో పాటు డిస్ట్రిబ్యూటరీలను నిర్మించి జిల్లాలోని 3.45 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జల సాధన సమితి కార్యదర్శి గంగిరెడ్డి, అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ డెమోక్రటిక్ రైట్స్ (ఏపీడీఆర్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, మానవ హక్కుల వేదిక ప్రతినిధి ఎస్ఎం బాషా, రచయిత శాంతినారాయణ, రైతు సంఘం నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, సీపీఐ నేత మల్లికార్జున, భారత రైతు సంక్షేమ సంఘం నాయకుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, విద్యావంతుల వేదిక నాయకులు వెంకటేష్, సురేష్, కృష్ణ, ఏసు, పెద్దన్న, వీరనారప్ప, అరుణోదయ కళా మండలి నాయకులు చంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడ ఉండలేను నాన్నా..

కటిక పేదరికంతో కష్టాలు పడుతున్న ఓ కుటుంబాన్ని విధి వెక్కిరించింది. పిల్లాడికి ఒక్క పూట తిండి పెట్టలేని స్థితిలో పనిలోకి పంపిన తల్లిదండ్రులకు చివరకు గర్భశోకమే మిగిలింది. బరువైన పనులు చేయలేక సతమతమైన చిన్నారి పట్టుమని 14 ఏళ్లు కూడా నిండకనే ఉరికి విగతజీవిగా వేలాడాడు. విషాదకరమైన ఈ ఘటన అనంతపురం కలెక్టరేట్‌కు ఓ కిలోమీటరు దూరంలో చోటుకోవడం గమనార్హం.

- చిరుప్రాయంలోనే భవన నిర్మాణ కార్మికుడిగా మారిన బాలుడు
- బతుకు తెరువు కోసం అనంతకు వలస
- బరువైన పనులు చేయలేకపోతున్నానంటూ తల్లిదండ్రుల వద్ద ఆవేదన
- సొంతూరికే వస్తానని... వ్యవసాయ పనులు చేస్తానంటూ వేడుకోలు
- స్పందించని కుటుంబసభ్యులు
- మనస్తాపంతో ఆత్మహత్య

అనంతపురం: భవన నిర్మాణ రంగంలో బరువైన పనులు చేయలేక ఓ బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురం రెండో పట్టణ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా ఆదోని మండలం పెద్ద తుంబలం గ్రామానికి చెందిన కురబ అయ్యన్నకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కటిక పేదరికం కారణంగా పిల్లలను పోషించుకోలేక ఇబ్బంది పడేవారు. ఈ క్రమంలో చిరుప్రాయంలోనే పిల్లలు కార్మికులుగా మారారు. ఆరో తరగతితోనే చిన్న కుమారుడు శివ (14) కూడా చదువులకు స్వస్తి పలికి తన అన్న నాగేంద్రతో పాటు సెంట్రింగ్ పనుల్లో పాలుపంచుకోసాగాడు.

బతుకు తెరువుకు వలస వచ్చి...

బతుకు తెరువులో భాగంగా నాగేంద్ర, శివ, రమేష్, సురేష్, వలి ఆరు నెలల క్రితం అనంతపురానికి వలస వచ్చి భవన నిర్మాణ పనుల్లో పాలుపంచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో హౌసింగ్ బోర్డులోని హమాలీ కాలనీలో ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. వేకువజామునే పనిలోకి వెళ్లి సాయంత్రం ఆరు గంటల తర్వాత గదికి చేరుకునేవారు. విపరీతమైన పని ఒత్తిడితో పాటు పని ప్రాంతంలో బరువైన పనులు చేయలేక శివ ఇబ్బంది పడ్డాడు. ఇదే విషయాన్ని తన తల్లిదండ్రులకు పలుమార్లు తెలిపాడు. అనంతపురంలో ఉండడం తనకు ఇష్టం లేదని, ఊరికి వచ్చేస్తానని, తనను పిలుచుకెళ్లాలని పలుమార్లు ప్రాధేయపడ్డాడు. అక్కడ వ్యవసాయ కూలి పనులకు వెళ్లతానంటూ వేడుకున్నాడు. అయినా తల్లిదండ్రులు వినలేదు. దీంతో మనస్తాపం చెందిన శివ... శుక్రవారం మధ్యాహ్నం గదికి వెళుతున్నట్లు తన అన్న నాగేంద్రకు తెలిపి పని ప్రాంతం నుంచి ఒక్కడే గదికి చేరుకుని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న అనంతపురం రెండో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాలుడి తండ్రి అయ్యన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శ్రీకాంత్‌యాదవ్ తెలిపారు.



ఆత్మహత్య చేసుకున్న శివ